


# వియ్యాలవారు-వీసా

పొత్తూరి విజయలక్ష్మి

పొద్దున ఎనిమిది గంటలైంది

''విశాలా! వీళ్ళీపాటికి అక్కడికి వెళ్ళి ఉంటారంటావా?'' అడిగాడు వెంకట్రావు.

'ఏం సొద పెడుతున్నారండీ! అంటే అన్నానంటారు గానీ ఈ మధ్య మీకు చాదస్తం ఎక్కువైపోతుంది!' విసుక్కుంది విశాలాక్షి.

''ఏమిటో కాళ్ళూ చేతులూ ఆడడం లేదు. ఒకటే టెన్షన్‌గా ఉంది'' అన్నాడు వెంకట్రావు.

''మీదంతా మరీ విచిత్రంగా ఉంది. ఏదో ఆపద ముంచుకొచ్చినట్లే మీరు కంగారు పడిపోయి నన్ను కంగారు పెట్టేస్తున్నారు'' అంది విశాలాక్షి.

''నీకేం తెలుసు నా బాధ' ఎలాగైనా ఈ ఆపద తప్పిపోతే బావుండని దేవుడిని ప్రార్థిస్తున్నాను. నా కోరిక తీరితే మన ఇంటి ముందర పెట్టిన వినాయకుడికి ఉండ్రాళ్ళు నైవేద్యం పెడుతాను'' అన్నాడు రెండు చేతులూ జోడించి.

''ఈ మొక్కుతో పదహారు మొక్కులు పూర్తయ్యాయి. ఏదో మిన్ను విరిగి మీద పడ్డట్టు ఏవిటండీ మీ కంగారు!' అంది విశాలాక్షి.

'' అది కాదు విశాల?''

''ఏదీ కాదు! ఎవరన్నావింటే నవ్విపోతారు! జరిగేది ఏదో జరగక మానదు. మీరు కంగారుపడి బి.పి. పెంచుకోకండి'' అని కసిరేసి వెళ్ళిపోయింది.

కాసేపు కాలుగాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరిగి పదిగంటలకి వియ్యంకుడి సెల్‌కి ఫోన్ చేశాడు. ఆయన రిసీవ్ చేసుకున్నాడు.

ఈయన కంటే పదింతలు కంగారుగా వున్నాడాయన.

''ఆ! రైలు రైట్‌టైంకే వచ్చింది. మావాళ్ళింటికెళ్ళి స్నానం చేసి ఇదుగో ఇక్కడికి వచ్చాం. ఏం బావగారూ! పనవుతుందంటారా? మా పనవ్వాలని దేవుడికి దణ్ణం పెట్టుకోండి బావగారూ!'' అన్నాడు దాదాపు ఏడిచేస్తూ.

''అవుతుంది లెండి. కంగారు పడకండి. అన్నింటికీ దేవుడే వున్నాడు'' అని ధైర్యం చెప్పాడు వెంకట్రావు.

ఆయనకి చాలా దిగులుగా వుంది. భార్యను పలకరిస్తే కరిచేలా వుంది. కాసేపు పేపరు తిరగేశాడు. టీ.వీ. చూశాడు. దేనిమీద బుద్ధికుదర్లేదు. వెళ్ళి మంచం మీద పడుకున్నాడు.

ఎదురుగా అటక మీద పెట్టివున్న గున్న ఏనుగుల్లాంటి నల్లసూట్‌కేస్‌ల మీద పడింది వెంకట్రావు దృష్టి.

అదిరిపడి లేచి కూర్చున్నాడు. చివాల్న లేచి వంటింట్లోకి వెళ్ళాడు. ''విశాలా! నీకేమనిపిస్తోంది. దొరుకుతుందా వీసా దొరకదా? పోనీ వీళ్లుకాకపోతే వీళ్ళ బంధువల్లో ఎవరికైనా వీసా వుంటే వాళ్ళనే వెళ్లమందాం! అన్నాడు కంగారుగా!

తలబాదుకుంది విశాలా! ''మీ కంగారు

బంగారం గానూ! ఏ విషయం ఇంకా నాసేపట్లో తెలిసిపోతుంది. ఏం చెయ్యాలో అప్పుడాలోచిద్దాం! ఇప్పట్నించే నా బుర్ర తినకండి... అని విసురుగా సమాధానం చెప్పింది.

ఇంట్లో వుంటే ఇలాగే పీక్కు తింటాడని త్వరగా వంట ముగించి టేబుల్ మీద పెట్టింది. చీర మార్చుకుని నేను బయటికెళ్లొస్తాను. నాకోసం చూడకండి. అన్నీ బల్లమీద పెట్టాను. మీరు భోజనం చెయ్యండి'' అని చెప్పి అతని సమాధానం కోసం చూడకుండా వెళ్ళిపోయింది విశాలక్షి.

ఇదో మొద్దావతారం. చీమకుట్టినట్టైనా లేదు దీనికి . అయినా దీనికేం తీపరం? ఎక్కడున్నా కాలక్షేపానికి కొదవ వుండదు. ఈ తెలకాయ నెప్పులన్నీ నాకే అని పళ్ళుకొరుక్కున్నాడు.

ఎదురుగా షోకేస్‌లో వరసగా వున్నాయి ఫొటోలు. పిల్లలిద్దరూ కాలేజీల్లో వుండగా తాము నలుగురి ఫొటో.

అమ్మాయి పెళ్ళి ఫొటో. తర్వాత అమ్మాయీ అల్లుడు మనవడు. తర్వాత అమ్మాయీ అల్లుడు, మనవడు మనవరాలూ, ఆఖర్న అబ్బాయి పెళ్ళి ఫొటో! చివరగా నిట్టూర్చాడు వెంకట్రావు.

ఉరుము వురిమి మంగలం మీద పడటం అంటే ఇదే. మారోజులే నయం. ఈ తలనెప్పి వుండేదికాదు. అనుకున్నాడు.

విశాలాక్షి కడుపుతో వున్నప్పుడు ఏడో నెల్లో పురిటికి పంపేసి పిల్లకి అయిదోనెల వచ్చి ఆవిడ వచ్చే వరకూ ఖుషీ ఖుషీగా కాలం గడిపేశాడు.

రెండోపురిటికీ అంతే... ఏ బాదరబందీ లేకుండా గడిచిపోయింది. తర్వాత కాలం మారింది. కూతురికి పెళ్ళి అయింది. అల్లుడు కంప్యూటర్ ఇంజనీర్. అమెరికాలో వున్నాడు. కూతుర్ని అంతదూరం పంపిస్తుంటే గుండె బరువెక్కింది. ఆ తర్వాత అమ్మాయి పంపించిన ఫొటోలూ అవీ చూసి, పోన్లేదూరాన వున్నా మహారాణిలాగా వుంది అని తృప్తి పడ్డాడు.

పెళ్ళయిన ఏడాదికి కూతురికి నెల తప్పింది.

వెంకట్రావు, విశాలక్షిల ఆనందం వర్ణనాతీతం. ''ఎప్పుడొస్తావమ్మా పురిటికి?'' అని అడిగారు.

''నేను రాను నాన్నా! అలా వస్తే చాలా ప్రాబ్లమ్స్ వున్నాయి. మీరూ అమ్మా రండి. అంది కూతురు.

ఏనుగెక్కినంత సంబరపడ్డారు వీళ్ళు. కూతురి పుణ్యమా అని అమెరికా వెళ్తున్నాం అని సరదాపడిపోయారు.

అల్లుడు కావలిసిన పేపర్లన్నీ పంపించాడు. వీసా కోసం వెళ్తే వీసా తిరిగ్గానే దొరికింది. పదేళ్ళకు వీసా ఇచ్చేశారు. కూతురికి పుట్టబోయే బిడ్డకు బోలెడన్ని వస్తువులు కొనుక్కుని అమితోత్సాహంతో అమెరికా ప్రయాణం అయ్యారు.

క్రమశిక్షణకు మారుపేరుగా వుండే ఆ అగ్రరాజ్యాన్ని కళ్ళారా చూసి పరవశించిపోయారు. వీళ్ళు వెళ్ళిన పదిరోజులకే అమ్మాయికి డెలివరీ అయింది. మరోనెల రోజులు పసిబిడ్డతో కాలక్షేపం అయిపోయింది.

క్రమంగా వారిలోని ఉత్సాహం నీరుగారిపోయి దానిస్థానాన నీరసం కలగసాగింది. ఆ ప్రాంతంలో విపరీతమైన చలి. ఎండాకాలం మండుటెండాకాలం తప్ప మరోసీజన్ ఎరుగని విజయావాడలో పుట్టిపెరిగిన వెంకట్రావు ఆ వాతావరణానికి తట్టుకోలేకపోయాడు.

ఇక విశాలక్షి అలవాటులేని పనిభారం వల్ల సతమతం అయిపోయింది. మనిషి సాయం వుండదు. అన్నీ స్వయంగా చేసుకోవాలి. ఎన్ని మిషన్లు వున్నా రాత్రి అయేసరికి ఆవిడ కళ్ళనీళ్ళపర్యంతం అయ్యేది.

రాత్రి పసివాడు లేచి ఏడిచేవాడు. వాడితో సరిగ్గా నిద్ర వుండేది కాదు.

వెంకట్రావుకి ఇరవైనాలుగ్గంటలూ ఇంట్లోనే గడపవలసి రావడంతో పిచ్చెక్కినట్లు అయింది. గుమ్మం దాటి వెళ్ళాలంటే అల్లుడిసాయం కావాలి.

అతను అలిసిపోయి ఇంటికొచ్చాక అల్లుడి నన్నలా ఎక్కడికైనా తీసికెళ్ళుఅని ఏమామ గారు అడగ్గలడు. ఒకసారి ఒంటరిగా బయటకు వెళ్ళి రోడ్డు దాటుతుంటే పోలీసు పట్టుకున్నాడు. పరాయి దేశంవాడని తెలుసుకుని వార్నింగ్ ఇచ్చి వది లేశాడు.

ఇంకోసారి అల్లుడితో బయటికి వెళ్ళినపుడు, హోటల్లో పీజ్జాతింటూ పక్కటేబుల్ దగ్గర వున్న తెల్ల అమ్మాయిని చూస్తూవుంటే అల్లుడు మందలించాడు.

''అట్లా చూడకూడదు మామయ్యగారూ'' అన్నాడు.


వెంకట్రావుకి చచ్చేంత మొహమాటం వేసింది అప్పటికీ. ''అబ్బే! నేను వూరికే చూశాను అల్లుడూ'' అని చెప్పాడు.

''అలా వూరికే కూడా కళ్ళప్పగించి చూడకూడదండీ! ఇక్కడి వాళ్ళు అపార్థం చేసుకుంటారు. ఇంకెప్పుడూ అట్లా చూడకండి?'' అని మెత్తగా మందలిస్తూ వుంటే వెంకట్రావుకి ప్రాణం చచ్చిపోయింది. ఇంత బతుకూ బతికి ఇంటివెనకాల చచ్చినట్లూ అయింది. ఇక అమ్మాయి లేకుండా అల్లుడి వెంట చచ్చినా రాకూడదు అనుకున్నాడు.

కాలక్షేపం కాకపోవడం ఒక సమస్య అయితే భోజనం సమస్య కూడా తోడైంది. అక్కడ అన్నీ దొరుకుతాయి గానీ రుచి వుండదు. అంత రుచికరంగా వండిపెట్టే తీరిక విశాలాక్షికీ లేదు. పీకల్లోతు పనిలో మునిగి సతమతం అయిపోతున్న భార్యను కమ్మగా వండిపెట్టమని అడగడానికి వెంకట్రావుకి మనసొప్పలేదు.

కూతురు ఉద్యోగంలో జాయిన్ అయ్యాక మరీ వూపిరి సలపనట్లు అయింది. వాళ్ళిద్దరికీ. ఇక రోజులు లెక్కపెట్టుకోవడం మొదలయింది. ఏదో దాని దారిన దాన్ని వదిలేస్తే కాలం గడిచిపోతుంది గానీ ఎలాగడుస్తుందా అని దిగులు పడితే మరీ నత్తనడక నడుస్తుంది.

మనవడి ముద్దు ముచ్చటలు చూసుకొని ఓపక్క ఆనందిస్తూనే తిరిగి ఇండియా వచ్చేసే రోజు కోసం వెయ్యికళ్ళతో ఎదురు చూస్తూ గడిపారిద్దరూ.



ఎలాగో గడిచిపోయాయి ఆరునెలలు. పసివాడిని వదిలివెళ్ళడానికి ప్రాణం కొట్టుకుపోతున్నా స్వదేశానికి వెళ్ళిపోతున్నామనే తృప్తి ఆ దిగులుని ఆధిగమించింది. విమానం దిగగానే వంగి నేలను కళ్ళకద్దుకున్న వెంకట్రావుని చూసి చిన్నగా నవ్వుకున్నారు.

ఇంటికొచ్చి తనగదిలో తన మంచం మీద నడుంవాల్చి ఇదే నా స్వర్గం అనుకున్నాడు. పనిమనిషి పన్లన్నీ చేసి పెడుతూవుంటే ఈ భోగం అక్కడ రాదు కదా! అనుకుంది విశాలక్షి.

రెండేళ్ళు గడిచాయి. కూతురికి మళ్ళీ నెల తప్పింది. వెంకట్రావు గుండెల్లో రాయిపడింది. ఈసారి నువ్వే ఇక్కడికి రామ్మా అని బతిమాలాడు. అలా వీలుపడదు నాన్నా అంటూ ఏవో వాళ్ళ ఇబ్బందులన్నీ ఏకరువు పెట్టింది కూతురు

ఫలితం మళ్ళీ అమెరికా ప్రయాణం మళ్లీ ఇల్లంతా సర్దుకుని ఆరునెలలు ఇక్కడ చేయవలసిన పనులు స్నేహితులకి అప్పగించి, సామాన్లు సర్దుకుని ఈసారికనుకుంటూ విమానం ఎక్కారు దంపతులు.

అక్కడ ప్రతిపని మరింత పెరిగింది బాలింత, పసిపాపతో బాటు ఎడపిల్లాడు కూడా! ఇంటి దగ్గర చక్కగా గంజిపెట్టిన ఇస్త్రీ చీరె కట్టుకుని వుండే విశాలక్షి అక్కడ చీరెలు వుతికి ఆరేయడం కష్టం అని సింథెటిక్ పంజాబీడ్రెసెలు కొనుక్కుంది కూతురి సలహా మీద.

భార్యను ఆ నైలాను పంజాబీ డ్రెస్‌లలో చూడలేకపోయేవాడు వెంకట్రావు. ఈ లుంగీలూ అవీ మెయిన్‌టెయిన్ చెయ్యడం కష్టం అని అల్లుడు పొట్టి నిక్కర్లూ, టీ షర్టులూ ఇచ్చాడు మామగారికి. ఆ వేషంలో భర్తని చూసి కళ్ళనీళ్ల పర్యంతం అయింది విశాలాక్షి.

ఇస్త్రీ మడత నలగని బట్టలేసుకునే మహారాజుకి ఈ పిట్టలదొర వేషం ఏమిటో మా ఖర్మకాక పోతేనూ అని బాధ పడింది.

పిల్లలని పెంచుకుంటూ, ఇల్లు సర్దుకుంటూ, లాను కత్తిరించుకుంటూ ఎలాగైతేనేం అతికష్టం మీద ఆర్నెల్లూ గడిపేశారు. విమానం ఎక్కి అమెరికాకి ఓ నమస్కారం. ఇక వచ్చే అవసరం లేదు. అంతగా వచ్చినా నెల్రోజులుండి అన్నీ చూసి వెళ్ళడమే. అనుకున్నారు ఇద్దరూ!

ఆ ఏడాదే కొడుకు ఇంజనీరింగ్ పూర్చి చేసి ఎమ్.ఎస్ చెయ్యడానికి అమెరికా వెళ్ళాడు. చదువు అవగానే వచ్చేస్తాను అని కబుర్లు చెప్పిన వాడు కాస్త చదువు సగంతులు వుండగానే ఏదో చిన్న ఉద్యోగంలోజేరి చదువు పూర్తవగానే పెద్ద ఉద్యోగంలోకి మారిపోయాడు.

జీవితంలో స్థిరపడ్డాను నాకు పెళ్ళి చెయ్యండి అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. నెల్లాళ్ళు సెలవుపెట్టి వచ్చి పిల్లను చూసి పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయాడు.

వియ్యాల వారు మంచి వారు. మర్యాదస్తులు. కోడలు కూడా బుద్ధిమంతురాలు. పిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళు పేరంటాలు అయిపోయాయి అని నిశ్చితంగా ఊపిరి పీల్చుకున్నారు. వెంకట్రావు, విశాలాక్షి.

పెళ్ళయిన ఏడాదికే కోడలికి నెలతప్పిందనే శుభవార్త. వంశోద్ధారకుడు పుట్టబోతున్నాడని ఆనంద పడ్డారు తాతా నాన్నమ్మలు.

ఇక అటు కాబోయే అమ్మమ్మా తాతయ్యల ఆనందం చెప్పనలవికాదు.

ఆవిడ పేరు రాజ్యలక్ష్మి. ఆయన గోపాలక్రిష్ణ. వాళ్ళది గుంటూరు జిల్లా నర్సరావుపేట దగ్గర పల్లెటూరు. ఆయన కొంతకాలం బ్యాంకులో పనిచేసి వాలంటరీ రిట్టైర్మెంట్ తీసుకుని హైదరాబాద్ వచ్చి రియల్‌ఎస్టేట్ వ్యాపారం మొదలుపెట్టాడు.

హత్య, కిడ్నాప్ చెయ్యబడేంత గొప్పగా లేకపో



యినా బాగానే నిలదొక్కుకున్నాడు. బాగానే సంపాదించాడు. ముగ్గురూ కూతుళ్ళే. ఇంట్లో పనివాళ్ళు హంగూ హడావిడి దర్జాగా వుంటారు.

ఈ అమ్మాయే పెద్దది. కూతురు కడుపుతో వుందనే సరికి ఆవిడ సంతోషంతో పొంగిపోయింది. వెంటనే వెళ్తాను అని ప్రయాణం కట్టింది. ఇప్పటి నించీ ఎందుకు అయిదోనెల రానీ అని ఆపేశాడు భర్త. అదేంవీల్లేదు పిల్లకి కావలసినవి వండిపెట్టద్దూ అంటూ, ఆవిడ అమితోత్సాహంతో ప్రయాణానికి సిద్ధం అయింది. కానీ వీసా దొరకలేదు. డబ్బున్నా ఈవిడ బొత్తిగా పల్లెటూరి మనిషి. ఈవిడ వేషభాషలు అమెరికా వాళ్ళకి నచ్చలేదు వీసా రిజక్ట్ చేసేశారు.

ఆవిడ హతాశురాలైంది. పోనీ పిల్లనే ఇక్కడికి పిలిపించుకుందామంటే దానికీ సవాలక్ష మడత పేచీలున్నాయిట. అదీ కుదరదన్నారు. అవతల పిల్ల ఒంటరిగా అవస్థ పడుతూవుంటే నాకీ సుఖాలన్నీ ఎందుకు అని ఏడుస్తూ మనోవ్యాధితో చిక్కి శల్యమైపోయింది. మళ్ళీ అప్లైచేసుకొని, మరో రెండు నెలలు ఆగి మళ్ళీ వెళ్ళింది వీసాకోసం కాస్త ఇంగ్లీషు కూడా నేర్చుకుంది కానీ ఈవిడ ఆరోగ్య పరిస్థితి మీద మాకు అనుమానంగా వుంది సారీ వీసా ఇవ్వలేం అన్నారు.

అవతల పిల్లకి ఏడోనెల కూడా వచ్చేసింది. మరింత దిగులుపడిపోయింది. వియ్యపురాలిని పట్టుకుని పోనీ మీరు వెళ్తారా వదినగారూ! పిల్ల వంటరిగా వుంది. అని ఏడిచేసింది.

ఫర్వాలేదమ్మా అమెరికాలో వున్న తెలుగు పిల్లలకు డెలివరీకి వెళ్లేదాకా వంటరిగా మేనేజ్ చెయ్యడం అలవాటే. మేమూ మా అమ్మాయి డెలివరీకి వారం రోజులు ముందు వెళ్ళాం. అని ధైర్యం చెప్పాడు వియ్యంకుడు.

రాజ్యలక్ష్మికి రెండుసార్లు వీసా రిజెక్ట్ అయిందని తెలుసుకుని పలకరించి పోదామని గుంపులు గుంపులుగా వచ్చారు బంధుమిత్రులు.

ఏవిటోనండీ ఈ అమెరికా వాళ్ళకి పద్దతీపాడు లేవు. ఒకరికేమో పేరూ ఊరూ అడిగి పదేళ్ళకు వీసా ఇచ్చేస్తారు.

ఇంకొకరికి చీల్చి చెండాడి ఇవ్వం పొమ్మంటారు. పిల్లలని తీసుకుపోయి వాళ్ళదేశంలో ఉద్యోగాలిచ్చి వాళ్ళచేత చాకిరీ చేయించుకుంటూ పెద్దవాళ్ళకి వీసాలు ఇవ్వకుండా ఏడిపించడం అన్యాయం కాదూ!

మన ఆఫీసుల్లో అయితే ఎవర్నో పట్టుకుని ఎవరి చేతుల్లో అయినా ఏదైనా పెట్టి పని జరిపించుకోవచ్చు.

ఆ అమెరికన్ కాన్సులేట్‌లో ఆ సదుపాయం కూడా లేదు. అమ్మ పెట్టదు. అడుక్కుతినా నివ్వదు అన్నట్లు వుంటుంది వీళ్ళ వ్యవహారం అంటూ సానుభూతి చూపించారు.

మరోసారి అప్లై చెయ్యండి. ఏకంగా ఈసారి ఇద్దరికీ అప్లై చేస్తారు కదా! గ్యారెంటీగా వస్తుంది అని కొందరు ఆశావాదులు ధైర్యం చేప్తే

ఏమో ఒకసారి రిజెక్ట్ అయితే కష్టమే మరి! అని కొందరు నిరాశావాదులు నీరుగార్చేశారు.

రాజ్యలక్ష్మి, గోపాలక్రిష్ణా క్రమం తప్పకుండా ప్రతిరోజూ వియ్యాల వారింటికి వచ్చి హృదయవిదారకంగా తమగోడు చాటుకుంటున్నారు. అవతల కొడుకు రెండ్రోజులకి ఒకసారి ఫోన్ చేసి ''అమ్మా ఏవిటే మరి! వాళ్ళకు వీసా దొరికితే సరే. లేకపోతే ఏవిటి దారి? మీరంతా వుండి నన్నూ నాభార్య బిడ్డలనీ అనాధల్లా వదిలేస్తారా?'' అని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు తల్లిని.

ఈ వ్యవహారం అంతా చూస్తే వెంకట్రావు గుండె తారు మంటోంది. కొంపదీసి మళ్ళీ నామెడకి చుట్టుకోదు కదా ఆ అమెరికా ప్రయాణం అని దిగులు పడుతున్నాడు.

''నువ్వు అనవసరంగా మాటివ్వకు. నేను చచ్చినా రాను అమెరికా'' అని భార్యని హెచ్చరిస్తున్నాడు. ముక్కోటి దేవతలకూ మొక్కుకుంటున్నాడు వియ్యాల వారికి వీసా రావాలని.

అక్కడ పిల్లకి ఎనిమిదో నెల నిండింది. రాజ్యలక్ష్మి, గోపాలక్రిష్ణా మళ్ళీ వెళ్ళారు వీసా కోసం.

ఇక్కడ వెంకట్రావు కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. ఏదో నామమాత్రంగా నాలుగు మెతుకులు నంజి లేచిపోయాడు. విశాలాక్షి మధ్యాహ్నం నిద్రపోయింది గానీ ఆయనకు మాత్రం నిద్రపట్టలేదు.

సాయంత్రం నాలుగు దాటాక ఫోను మోగింది. వియ్యంకుడి నెంబరే. గుండె దడదడలాడ్తోనే ఫోనెత్తేడు.

అవతలనించి ''బావగారూ'' అంటూఏడుపు మొదలు పెట్టాడాయన. గుండె ఆగినంత పనైంది వెంకట్రావుకి

''నీకిక్కడ ఉద్యోగం సద్యోగం లేదు. నిన్ను పంపిస్తే మా అమెరికాలో సెటిల్ అయిపోతావు. వీసా ఇవ్వం. అన్నారు బావగారూ! నేనుండను. నాకిక్కడ సవాలక్ష వ్యాపకాలున్నాయి. మా ఆవిడ ఆర్నెల్లుంటుందిగానీ నేను మూడు నెలల్లో తిరిగొచ్చేస్తాను అని దేవుడి మీద ప్రమాణం చేసి చెప్పినా విన్లేదు ఆ మొండి వాళ్ళు'' అంటూ మరోసారి బావురుమన్నాడు.

వెంకట్రావుకి జాలివెయ్యలేదు సరికదా విసుగేసింది. ''సర్లెండి ఇక్కడికొచ్చాక మాట్లాడుకుందాం'' అని ఫోను పెట్టేశాడు.

పదినిముషాల తర్వాత మళ్ళీ మోగింది ఫోను. నెంబరు చూసిన వెంకట్రావుకి ఆగ్రహం కలిగింది. అంతలోనే వచ్చేసింది విశాలాక్షి.


చిన్నుగాడు అంటూ ఫోన్ తీసింది. అవతల కొడుకేం చెప్పాడోగానీ ఈవిడ కళ్ళవెంటనీళ్ళు ధారాపాతంగా కారడం మొదలు పెట్టాయి.

ఇక ఇంట్లో క్షణం కూడా వుండబుద్ధికాలేదు. చెప్పులేసుకుని బయటికెళ్ళి పోయాడు.

పార్కులో కూర్చుని రాత్రి పొద్దుపోయాక తిరిగొచ్చేడు.

విశాలాక్షి ఏదో చెప్పబోతే విననట్లూ టీ.వీ చూస్తూ కూర్చున్నాడు. ఆవిడ వదల్లేదు. ''మరి టికెట్లూ అవీ చూసుకోండి. ఆలస్యం అయితే దొరకవు'' అంది మెల్లిగా.

''నేన్రాను. నువ్వొక్కతివే వెళ్ళు'' చిరాగ్గా చెప్పాడు.



"అలాగే వెళ్తాను. నాకు తప్పదుగా; అయినా ఇంటి విషయం పిల్లల విషయం మీరు ఏనాడు పట్టించుకున్నారు గనక? ఆఫీసుపనీ కాస్త తీరిక దొరికితే ఫ్రెండ్స్‌తో కాలక్షేపం! ఇన్నాళ్ళూ వంటరిగానే ఈదుకొచ్చాను. ఈకాస్తా ఈదలేకపోను" అని విసుగ్గా చెప్పి వెళ్ళిపోయింది.

ఆపెడసరం సమాధానం చూసి ముందు కోపగించుకున్నా తర్వాత జాలి వేసింది. తప్పనిసరిగా వెళ్ళవలసి వస్తోందిగానీ దానికీ మాత్రం సరదానా అమెరికా వెళ్ళి పురుడు పోయ్యడం అంటే! అసలే ఓపిక లేదని అఘోరిస్తోంది. "ఆ చిరాకంతా నామీద చూపిస్తోంది" అనుకున్నాడు

మర్నాడు తెల్లవారేసరికి స్టేషన్‌నించి నేరుగా ఇక్కడికే వచ్చేశారు వియ్యాలవారు. వాళ్ళ బాధ చూసి ఇంట్లోవాళ్ళూ, పనివాళ్ళూసరే వీసా విషయం ఏమైందా కనుక్కుందాం అని వచ్చిన ఇరుగుపొరుగు వాళ్ళు కూడా కళ్ళుతుడుచుకున్నారు

కంటికి రెప్పలా పెంచుకున్న పిల్ల సప్త సముద్రాల అవతల వుండిపోయింది. ఇక దానికి తల్లీ దండ్రే అన్నీ మీరే. మేము ఏమి చెయ్యలేని నిస్సహాయస్థితిలో వున్నాం. ఇవి చేతులు కావు కాళ్ళు. అని ప్రాధేయ పడుతూవుంటే సరే అనక తప్పలేదు.

నీటి బయట పడిన చేపలా అవస్థపడుతున్న భర్తని చూసి పొన్లెండి ఒక్కదాన్నే వెళ్ళోస్తాను ఈసారికి అంది విశాలక్షి

కానీ ఆవిడని ఒంటరిగా పంపడానికి మనసొప్పలేదు వెంకట్రావుకి ఇద్దరూ వుంటే ఒకరికొకరు సాయం. కాసేపు పిల్లవాడిని ఎత్తుకోవచ్చు

మొత్తానికి వద్దు వద్దనుకున్నా తప్పలేదు అమెరికా ప్రయాణం. టికెట్లు కన్‌ఫర్మ్ అయిపోయాయి.

ఏర్పాట్లు మొదలయ్యాయి. మీరు అమెరికా వెళ్తున్నారుట కదా! వచ్చేనెల్లో మా అమ్మాయి పుట్టినరోజు. నాలుగు డ్రెస్‌లు ఇస్తాం. పట్టుకెళ్తారా? మావాడు గంధం చెక్క క్రిష్ణ విగ్రహం కావాలని గోల పెడుతున్నాడు. కొనిస్తాం తీసికెళ్ళి ఇస్తారా? అంటూ లెక్కకు మించిన వచ్చేఫోన్లకు సారీ మాకే చాలా లగేజి వుంది అని సమాధానాలు చెప్పటంతో శ్రీకారం చుట్టారు.

ఆయనకి బి.పి. షుగరూ రెండూ వున్నాయి. ఆవిడకి షుగరు లేదు. బి.పి. ఒక్కటే. ఆర్నెల్లకి సరిపడా మందులు తీసుకుని ప్యాక్ చేస్తే అదే సగం సూట్ కేసు ఆక్రమించింది. వియ్యాల వారు ఓ పెట్టెడు సామాన్లిచ్చారు.

విశాలక్షి మళ్ళీ నైలాను పంజాబీ డ్రెస్‌లు కుట్టించుకుంది. అన్నీ సర్దితే రెండు పెద్ద సూట్‌కేసులూ, రెండు చిన్న సూట్‌కేసులూ నిండిపోయాయి.

లగేజ్ తూకం వేయిస్తే బొటాబొటీగా వుంది బరువు. ఇంక చాలు ఇకపైన గుండుసూది కూడా పట్టదు అన్నాడు వెంకట్రావు.

హాల్లో ఏనుగుల జంటలా వున్న ఆ సూట్‌కేసులను చూస్తూ బరువుగా నిట్టుర్చాడు వెంకట్రావు. ఎల్లుండే ప్రయాణం. మళ్ళీ ఎనభైమూడు రోజులు పరాయి దేశంలో వుండాలి అనుకుంటే ఎందుకో కళ్ళనీళ్ళు తిరిగాయి.

అప్పుడే ఫోను మోగింది. తీసి హలో అన్నాడు. అటునించి ఫ్రెండ్ "నేన్రా పురుషోత్తంని. నీకో శుభవార్త మా అబ్బాయికి పెళ్ళికుదిరింది. వాడు స్టేట్స్‌లోనే వున్నాడు కదా! ఆ అమ్మాయి కూడా సాఫ్ట్‌వేర్ సైడే ఏదో కంపెనీ పనిమీద ప్రస్తుతం అక్కడే వుందిట. మంచి ఫేమిలీ. ఆస్తిపాస్థులు బాగానే వున్నాయి"

అతని వాక్ప్రహానికి అడ్డుకట్ట వేశాడు వెంకట్రావు. "ఆస్థి లేకపోతే అడుక్కుతింటాం. వియ్యాల వారికి వీసా వుందా లేదా కనుక్కో లేకపోతే నీపని శ్రీమద్రమారమణ గోవిందా హరి!" అన్నాడు ఆవేశంతో.

★

